క్లుప్తంగా

ప్రాంగణ ఎంపికల్లో 32 మందికి ఉద్యోగాలు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం 24/7 ఏఐ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 32 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లాలోని వివిధ కాలేజీల నుంచి 130 మంది హాజరవగా వారికి ఆన్‌లైన్ టెస్టు నిర్వహించారు. అనంతరం ముఖాముఖి నిర్వహించి 32 మందిని అసోసియేట్స్‌గా నియమించారు. ఎంపికైన విద్యార్థులను కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందించారు.

కంటి ఆపరేషన్లకు 47 మంది తరలింపు


ఆపరేషన్లకు అవ్వాతాతలను తరలిస్తున్న డాక్టర్ మానస

మద్దిపాడు: జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు ఆస్పత్రి డాక్టర్ మానస తెలిపారు. 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 47 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు చెప్పారు. వారిని సోమవారం గుంటూరు జిల్లాలోని శంకరనేత్రాలయ ఆస్పత్రికి తరలించారు. ఏడు నెలల నుంచి 500 మందికిపైగా ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఈ నెల 15వ తేదీ మరో 50 మందికి కంటి ఆపరేషన్లకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వినీల చౌదరి, డాక్టర్ హనీఫ్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజ్, సీహెచ్‌వో లలితమ్మ, పీహెచ్‌ఎన్ రజితకుమారి, ఎంపీహెచ్‌ఎస్ బాలకోటయ్య, నాగేశ్వరరావు, ఆస్పత్రి సిబ్బంది, విలేజ్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చీమకుర్తి: వేసవి కాలంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి తెలిపారు. చీమకుర్తిలోని కార్పొరేషన్ బ్యాంక్‌పై మారం వెంకారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు గత నెల 5వ తేదీ నుంచి కంప్యూటర్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మారం వెంకారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లిటిల్ స్టార్ హైస్కూలు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, మారం వెంకటేశ్వరరెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, బడే దశరథరామిరెడ్డి, ఇస్తర్ల శంకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్ అదుర్స్..!


పచ్చదనంతో పాఠశాల ఆవరణ


నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాల

- గుండాయపాలెం హైస్కూల్లో సకల సౌకర్యాలు
- నాడు-నేడు ద్వారా పూర్తి స్థాయిలో అభివృద్ధి
- గ్రామస్తుల హర్షం
- తమ పిల్లలందర్నీ కచ్చితంగా పాఠశాలకు పంపించాలని తీర్మానం

ఒంగోలు రూరల్: మండలంలోని సముద్ర తీరప్రాంతం గ్రామమైన గుండాయపాలెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల చక్కగా ముస్తాబై విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలుకుతోంది. వేసవి సెలవులు ముగించుకుని స్కూలుకు వచ్చే విద్యార్థుల కోసం సకల సౌకర్యాలతో సిద్ధమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు మించి తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం ద్వారా గుండాయపాలెం హైస్కూల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అదనపు హంగులతో తీర్చిదిద్దారు. గతంలో ప్రాథమిక పాఠశాలగా ఉండగా, అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలగా, ఆ తర్వాత ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సిఫార్సుతో హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి అదనపు తరగతి గదులు కూడా నిర్మించారు. నాడు-నేడు మొదటి దశలో రూ.23,38,000తో పక్కా మౌలిక వసతులు, భవనాలు రూపుదిద్దుకున్నాయి. విద్యార్థుల సమావేశానికి వేదిక ఏర్పాటు చేశారు. బాలబాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, వాష్ రూమ్స్ నిర్మించారు. అన్ని తరగతులకు సరిపడా శాశ్వత భవనాలు, విద్యార్థుల తాగునీటికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం పాఠశాలలోనే గ్రంథాలయాన్ని ప్రారంభించారు. డిజిటల్ తరగతులకు కూడా ఏర్పాట్లు చేశారు. కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా కంప్యూటర్ ల్యాబ్‌ను తీర్చిదిద్దారు. రెండో దశ నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.25,22,000తో ప్రస్తుతం ఉన్న భవనంపై మరో ఫ్లోర్ వేశారు. ఒక భవనంలో నుంచి మరో భవనంలోకి వెళ్లేందుకు కారిడార్‌ను స్లాబుతో కలిపేసి విద్యార్థుల భద్రత కోసం రెయిలింగ్ ఏర్పాటు చేశారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 12 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, వారిలో 11 మంది నూతనంగా బదిలీపై వచ్చారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాల ఆవరణలో చెట్లు పెంచి పార్కులా తీర్చిదిద్దారు. గోడలకు సైన్స్ సంబంధిత విషయాలతో కూడిన ఆయిల్ పెయింటింగ్ వేయించారు. మత్స్యకార గ్రామమైన గుండాయపాలెంలో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన సాగుతుండటంపై ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలందర్నీ కచ్చితంగా పాఠశాలలకు పంపించాలని గ్రామస్తులు, మత్స్యకారులు తీర్మానం చేసుకోవడం కొసమెరుపు.


విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీ


నిర్మాణం పూర్తిచేసుకుంటున్న పాఠశాల ముఖద్వారం


పాఠశాలలో రెండు భవనాలను కలుపుతూ ఏర్పాటు చేసిన కారిడార్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- క్రమం తప్పకుండా జగనన్న విద్యా కానుక కిట్లు
- తల్లిదండ్రులకు తగ్గిన భారం
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు తెరిచిన సందర్భంగా మండలంలోని దేవరపాలెం జిల్లాపరిషత్ హైస్కూలు, చీమకుర్తి రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు జేవీకే కిట్లను వెంకాయమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికి దాదాపు రూ.30 వేల విలువ చేసే నోట్‌పుస్తకాలు, మూడు జతల యూనిఫాం, షూ, సాక్స్‌లు, పాఠ్యపుస్తకాలు, బెల్ట్‌లను స్కూలు బ్యాగ్‌లో పెట్టి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఇద్దరు ముగ్గురు విద్యార్థులున్న తల్లిదండ్రులకు పాఠశాలల ప్రారంభోత్సవం నాడు వేలల్లో ఖర్చును సీఎం తగ్గించారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం విద్యావ్యవస్థపై ఇంతలా ఖర్చుపెట్టలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల నుంచి వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దేవరపాలెంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి, స్థానిక నాయకులు, టీచర్లు, రామ్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, డాక్టర్ బీ జవహర్, హెచ్‌ఎంలు ఏ వీరారెడ్డి, ఎన్.హరిప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం రామారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సర్పంచ్ దర్శి నాగమణి చేతుల మీదుగా విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేశారు. కిట్లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

కొత్తపట్నం మండలంలో 3,800 మందికి జేవీకే కిట్లు...

కొత్తపట్నం: స్కూల్ ప్రారంభం రోజే జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమని అల్లూరు హెచ్‌ఎం మైతిలీ అన్నారు. మండలంలోని 53 పాఠశాలల్లో 3,800 మంది విద్యార్థులకు సోమవారం జేవీకే కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. 53 పాఠశాలల్లో హైస్కూళ్లు 6, ఎంపీపీ స్కూళ్లు 46, ఎయిడెడ్ స్కూల్ 1 ఉండగా, మొత్తం 6,129 మంది విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. మిగిలిన వారికి మంగళవారం కిట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు, జూనియర్ అసిస్టెంట్ అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


దేవరపాలెం జెడ్పీ హైస్కూల్లో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


సంతనూతలపాడు హైస్కూల్లో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న దుంపా చెంచిరెడ్డి


అల్లూరు హైస్కూల్లో పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం మైతిలీ

ప్రతి చిన్నారిని చదివించాలి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి


జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంఈఓ

మద్దిపాడు: ప్రతి చిన్నారిని తల్లిదండ్రులు చదివించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి సూచించారు. సోమవారం పాఠశాలల ప్రారంభోత్సవం సందర్భంగా మద్దిపాడు పైపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నాలుగేళ్లుగా ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందురోజే కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులు పరీక్షలు రాయబోయే సమయంలో పాఠ్యపుస్తకాలు వచ్చేవని, చంద్రబాబు ఏనాడూ ప్రభుత్వ విద్యావ్యవస్థను పట్టించుకున్న దాఖలాలు లేవని గుర్తుచేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందన్న సత్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రహించారని, అందుకే ఎన్ని కష్టాలు ఎదురైనా విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా చర్యలు తీసకుంటున్నారని అన్నారు. ముందుగా ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో 1 నుంచి 5వ తరగతి వరకూ 1,885 మంది విద్యార్థులు ఎన్‌రోల్ అయ్యారని, 6 నుంచి 10వ తరగతి వరకూ 2,159 మంది విద్యార్థులు ఎన్‌రోల్ అయి ఉన్నారని తెలిపారు. వారందరికీ పాఠశాలల వారీగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మూడు జతల యూనిఫాం, షూ, సాక్సులు, బెల్ట్‌లు, బ్యాగులు, టైలు ఇప్పటికే పాఠశాలలకు పంపిణీ చేశామని తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.2,500 ఖర్చుతో కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోరబోయిన విజయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం శేషగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించాలి

- ఎంపీడీవో సుజాత


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: సచివాలయం ద్వారా వస్తున్న వివిధ రకాల అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయంలో అందిస్తున్న సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అందించాలని కోరారు. కనీసం రోజుకు 25 సర్వీసులకు తగ్గకుండా ఆన్‌లైన్ చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే టికెట్లు, ఆర్టీసీ టికెట్ బుకింగ్, విద్యుత్ బిల్లులు, కులధ్రువీకరణ సర్టిఫికెట్లు, 1బీ, అడంగల్ వివిధ రకాల సర్వీసులు అందించాలని కోరారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి ఒక్క చెత్త సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అసంతృప్తిగా ఉన్న షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. అమూల్ పాల కేంద్రాల్లోనే పాలు పోసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వివరించారు. ప్రతి గృహానికి ఇంటి పన్ను వసూలు చేసి బ్యాంక్‌లో చలానా తీయాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాల చెన్నయ్య, సీనియర్ అసిస్టెంట్ కె.సుదర్శన్, జూనియర్ అసిస్టెంట్ ఆదిత్యపవన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు ఆన్‌లైన్ ప్రక్రియ


రైతుల చుక్కల భూముల డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణారావు

కొత్తపట్నం: చుక్కల భూములకు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చుక్కల భూములు ఆన్‌లైన్ చేయాలని సుమారు 30 మంది స్పందన కార్యక్రమానికి వచ్చారన్నారు. వాటిని పరిశీలించి ఆన్‌లైన్ చేస్తామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం కూడా ఆన్‌లైన్‌లో అప్లయ్ చేయిస్తున్నామన్నారు. కొంత మంది రైతులకు సంబంధించి పొలం హెచ్చుతగ్గులు ఉన్నాయని, వాటిని సర్వేయర్‌తో రీ సర్వే చేయించి స్కెచ్ తీసుకొస్తే భూమిని ఆన్‌లైన్ చేస్తామని అన్నారు. చుక్కల భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినప్పుడు పట్టా భూమి, ప్రభుత్వ భూమి అని ఏదీ చేయకుండా జీరో అని పెట్టడం వలన ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదన్నారు. ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసికెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామన్నారు. అది క్లియరైతే వారికి ఆన్‌లైన్ అవుతుందని స్పష్టం చేశారు. అప్పటిదాకా రైతులు వేచి ఉండాలని కోరారు. ముందుగా రైతుల దగ్గర ఉన్న వివిధ రకాల డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. మండలంలో 1,452 మంది రైతులకు సంబంధించి 1,478.45 ఎకరాల భూమి జాబితాను రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో వినోద్ కుమార్, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహాలకు భూమి పూజ

ఈతముక్కల (కొత్తపట్నం): మండలంలోని ఈతముక్కల గ్రామంలో జగనన్న లే అవుట్లలో గృహాల నిర్మాణానికి సోమవారం జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఈతముక్కల గ్రామంలో జగనన్న లే అవుట్లలో 145 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే విద్యుత్ స్తంభాలు, కండక్టర్ వైరుతో లైన్లు, నీటి ట్యాంక్‌లు, ట్యాప్‌లకు పైపులు, గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వసతులు సిద్ధం చేశామన్నారు. ఆరు నెలల్లో ఇళ్లు పూర్తి చేసి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, పుల్లయ్య, యశ్వంత్‌కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు షాపుల వేలంపాట

కందుకూరు: ఇటీవల వాయిదా పడిన పాతకూరగాయల మార్కెట్ ప్రాంతంలోని నూతన షాపింగ్‌మాల్ షాపుల వేలం ప్రక్రియను మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ సోమవారం తెలిపారు. షాపులకు సంబంధించి వాస్తవానికి ఈనెల 7వ తేదీనే వేలం నిర్వహించాల్సి ఉంది, కాని పరిపాలనా కారణాలరీత్యా వాయిదా వేశామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని జనరల్ కేటగిరీ కింద ఉన్న 2,3,4,5,6,7,8 షాపులకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ధరావత్తు కింద రూ.1,00,000, సాల్వెన్సీ లేదా ప్రాపర్టీ సర్టిఫికెట్ కింద రూ.2,00,000 చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిబంధనల ప్రకారం ఆసక్తి కలిగిన వారు మంగళవారం ఉదయం 11గంటలకు జరిగే బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునని కోరారు.

ఘనంగా బాలినేని ప్రణీత్‌రెడ్డి జన్మదిన వేడుకలు


ఢిల్లీలో కేక్ కట్ చేస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్టడీ టూర్‌లో భాగంగా దేశరాజధాని ఢిల్లీలో ఉన్న ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు కేక్ కట్ చేసి ప్రణీత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకుడు కటారి శంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకుడు గంటా రామానాయుడు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, బాలినేని పీఏ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జిలు బొట్ల సుబ్బారావు, బడుగు ఇందిర, నాయకులు దామరాజు క్రాంతికుమార్, తూము పద్మ, చింతగుంట్ల సువర్ణ, కావాటి రవి, మీరావలి, తోటపల్లి సోమశేఖర్, నాగూర్, కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సాహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, కమిషనర్ వెంకటేశ్వరరావు, 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ హరిబాబు రక్తదాతలను అభినందించారు. బాలినేని నివాసంలో ప్రణీత్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రణీత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక విశ్వసేవిక వృద్ధాశ్రమంలో కటారి సాయిసంజీవ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలతో పాటు గ్రైండర్ అందించారు. హౌసింగ్ బోర్డులోని బొమ్మరిల్లులో చిన్నారులకు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రేలా అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేసి నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేశారు. స్థానిక చర్చిసెంటర్‌లో నిరాశ్రయులకు, రిమ్స్ ఆవరణలోని రోగులకు ఆర్ఎస్ఆర్ ఫిషరీస్ యజమాని రామిరెడ్డి నితిన్‌రెడ్డి ఆధ్వర్యంలో శివం ఫౌండేషన్‌తో కలిసి అన్నదానం చేశారు. కటారి శంకర్, గంటా రామానాయుడు కేక్ కట్ చేశారు. రిమ్స్‌లో 400 మందికి అన్నదానం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పంది రత్నరాజు, మిడసల మధు, కొప్పర్ల విజయభాస్కర్, కార్పొరేటర్లు ప్రవీణ్, సూర్య రాజేష్, చిక్కాల కిరణ్‌కుమార్, విజయభాస్కర్, అమిత్, వల్లెపు మురళి, సుతారం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఒంగోలు రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలినేని నివాసంలో రేషన్ డీలర్లు కేక్ కట్ చేసి ప్రణీత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు కార్యాలయంలో, పలు డివిజన్లలో కేక్‌లు కట్ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈతముక్కలలో...

ఈతముక్కల (కొత్తపట్నం): బాలినేని ప్రణీత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈతముక్కల గ్రామంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సచివాలయ కన్వీనర్ నజీర్, పుల్లయ్య, రావుల భాగ్యలక్ష్మి, లింగారెడ్డి సంజీవరెడ్డి, మైనార్టీ నాయకుడు బాజీ, మహిళా నాయకురాలు అద్దూరి పుల్లమ్మ, చక్రవర్తి, యశ్వంత్ కుమార్, అడిగోపుల రవి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న కటారి శంకర్ తదితరులు


ఈతముక్కలలో ప్రణీత్‌రెడ్డి జన్మదిన కేక్ కట్ చేస్తున్న రవీంద్రరెడ్డి


వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు